మత్తు పదార్థాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో జయ చంద్రారెడ్డి

మత్తు పదార్థాల నివారణపై అవగాహన

తూప్రాన్, జూలై 8: మండలంలోని దాతర్ పల్లి శివారులో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా ఆర్డీవో జయ చంద్రారెడ్డి సోమవారం అవగాహన కల్పించారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు వ్యసనాలపై యువత, వారి తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. విద్యార్థులు వాటి వ్యాపకాల జోలికి పోకుండా, చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సద్గుణ గ్రేసీ, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

పోచమ్మ, ముత్యాలమ్మకు ఘనంగా బోనాలు

వెల్దుర్తిలో బోనాలు ఊరేగిస్తున్న మహిళలు

వెల్దుర్తి, జూలై 8: వెల్దుర్తిలో గ్రామ దేవతలు పోచమ్మ, ముత్యాలమ్మకు గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బోనాలు ఊరేగించారు. ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వెల్దుర్తిలో రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బోనాలు ఊరేగిస్తూ వచ్చి అమ్మవార్లకు సమర్పించారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రతపై కళాజాత

నిజాంపేట, జూలై 8: పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై తెలంగాణ సాంస్కృతిక కళాసారథి కళాకారులు మండలంలోని బచ్చురాజ్‌పల్లిలో సోమవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుడు ఎల్లం మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, పౌర సరఫరా సంబంధాల శాఖ ఆదేశాల మేరకు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ఆటపాటల రూపంలో గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందించబడుతుందని, ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను గ్రామస్తులకు తెలియజేశామన్నారు. కార్యక్రమంలో కళాకారులు ఆస రామారావు ఉన్నారు.

ఆశలకు రూ.26వేల వేతనం చెల్లించాలి

శివ్వంపేట, జూలై 8: కేంద్ర ప్రభుత్వం ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని తెలంగాణ ఆశవర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మండల మెడికల్ అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశవర్కర్లు మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం స్కీమ్‌కు బడ్జెట్ పెంచాలని, ప్రైవేటీకరణ చేయకూడదన్నారు. ఈఎస్ఐ తదితర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించి ప్రతినెలా రూ.10 వేల పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆశవర్కర్లు గోపమ్మ, రేణుక, మాధవి, సునంద, మంజుల, భూలక్ష్మి, భాషమ్మ, సబిత, వీరమణి, అనసూజ, లక్ష్మి తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వెల్దుర్తి, జూలై 8: వెల్దుర్తి జడ్పీహెచ్‌ఎస్‌లో 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 35 ఏండ్ల తర్వాత విద్యార్థులు కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులను సన్మానించారు.

వన మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్

నర్సాపూర్‌లో వన మహోత్సవంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్, జూలై 8: నర్సాపూర్ మున్సిపల్‌లోని రాయారావు చెరువు కట్టపై వన మహోత్సవంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ మొక్కలు నాటారు. అనంతరం 4వ వార్డులోని ప్రభుత్వ పాఠశాల, తుక్కారామ్ తండా అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయనతో మున్సిపల్ కమిషనర్ జైత్‌రాంనాయక్, కౌన్సిలర్లు రాంచందర్, యాదగిరి, వార్డు ఆఫీసర్ పరశురాం రెడ్డి, జవాన్ ఎల్లం తదితరులు ఉన్నారు.

చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్టు

శివ్వంపేట, జూలై 8: చోరీకి పాల్పడిన నిందుతుడిని అరెస్టు చేసినట్లు తూప్రాన్ సీఐ కృష్ణ తెలిపారు. సోమవారం ఎస్సై మహిపాల్‌రెడ్డితో కలిసి చోరీ కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న మండలంలోని సికింద్లాపూర్ గ్రామంలోని దొంటికె మహేశ్ ఇంట్లో బీరువా నుంచి 9తులాల బంగారం, రూ.5వేల నగదు చోరీకి పాల్పడిన ఘటనలో పోలీసులు దర్యాప్తు చేయగా, హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన కల్లె మహేశ్‌గా గుర్తించారు. నిందుతుడిని పట్టుకుని ఆరా తీశారు. నిందుతుడి నుంచి 9తులాల బంగారంతో పాటు రూ. వెయ్యి స్వాధీనం చేసుకున్నారు.

నిందితుడిని చూపుతున్న సీఐ కృష్ణ

గతంలో 23 దొంగతనం కేసుల్లో నేరస్తుడిగా రికార్డు ఉన్నట్టు సీఐ కృష్ణ తెలిపారు. సమావేశంలో పోలీస్ సిబ్బంది వీరస్వామి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కౌడిపల్లి, జూలై 8: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని బీజేపీ, బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కౌడిపల్లి తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేల రైతు భరోసాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ జిల్లా నాయకుడు రాజేందర్, రాఖేశ్, అశోక్, నర్సింలు, కృష్ణ తదితరులు ఉన్నారు.

అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- ఎస్పీ బాలస్వామి
- జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం, మండల కేంద్రాల్లో ప్రజావాణి నిర్వహణ

మెదక్ అర్బన్: ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ బాలస్వామి

తూప్రాన్: అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో జయ చంద్రారెడ్డి

చేగుంటలో..

నర్సాపూర్‌లో..



శివ్వంపేటలో..

మెదక్ అర్బన్, జూలై 8: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ డాక్టర్ బాలస్వామి అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మెదక్ మండలం జానకంపల్లికి చెందిన చరణ్ ఫిర్యాదులో తన తల్లిదండ్రులు ఎకరం పది గుంటల భూమి కొని పట్టా చేసుకోలేదని, వారు మృతిచెందారని, ప్రస్తుతం తామే కాస్తులోనే ఉన్నామని, తమకు పొలం అమ్మిన వారు తమదేనని దౌర్జన్యం చేస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. తగిన న్యాయం చేయాలని మెదక్ రూరల్ సీఐకి ఎస్పీ ఆదేశించారు.

తూప్రాన్‌లో 16 దరఖాస్తుల స్వీకరణ

తూప్రాన్, జూలై 8: తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం కొనసాగింది. పలు సమస్యల పరిష్కారం కోసం అర్జిదారుల నుంచి 16 దరఖాస్తులు స్వీకరించినట్లు తూప్రాన్ ఆర్డీవో జయ చంద్రారెడ్డి తెలిపారు.

కొత్త పాస్ బుక్కులు మంజూరు చేయాలి

శివ్వంపేట, జూలై 8: నూతన పాస్‌బుక్కులు మంజూరు చేయాలని ప్రజావాణి కార్యక్రమంలో పలువురు రైతులు ఇన్‌చార్జి తహసీల్దార్ షఫియోద్దిన్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. తిమ్మాపూర్ గ్రామ రైతులు మాట్లాడుతూ తమకు పాత పాస్‌బుక్కులు ఉన్నా కొత్త పాస్‌బుక్కులు రాలేదని, దీంతో రైతుబంధు, రైతుబీమా, పంట రుణాలు పొందలేకపోతున్నామని రైతులు శివలక్ష్మి, వెంకటేశ్‌గౌడ్, నర్సయ్య, మల్లమ్మ, భాగ్యమ్మ, వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశారు.

చేగుంటలో ప్రజావాణి

చేగుంట, జూలై 8: చేగుంట తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో డిప్యూటీ తహసీల్దార్ స్వప్న దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్‌యాదవ్, సర్వేయర్ రవీందర్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నర్సాపూర్, జూలై 8: రెవెన్యూ డివిజన్‌లోని రైతులు, ప్రజల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తానని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. 8 ఫిర్యాదులు వచ్చాయని, సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

బైపాస్ రోడ్డుతో వ్యాపారులకు ఇబ్బందులు

రామాయంపేట, జూలై 8: రామాయంపేటలో ప్రజావాణిని తహసీల్దార్ రజినికుమారి ప్రారంభించారు. తమ

రామాయంపేటలో..

భూములు మెదక్, ఎల్కతుర్తి రోడ్డులో పోతున్నాయని, ఆ రోడ్డు మాకు వద్దని రామాయంపేట వ్యాపారులు ఫిర్యాదు చేశారు. మెదక్, ఎల్కతుర్తి రోడ్డు వేసిన కాంట్రాక్టర్ డ్రైనేజీపై స్లాబ్ వేయకుండా విడిచిపెట్టడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని కోనాపూర్‌కు చెందిన మామిడి సిద్ధరాములు, రామాయంపేట ఎస్సీ కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని బైరం కుమార్ ఫిర్యాదు చేశారు.

ప్రసాద్ దర్శన్‌తో ఏడుపాయల అభివృద్ధి

మెదక్ ఎంపీ రఘునందన్ రావు

ఎంపీ రఘునందన్ రావుకు స్వాగతం పలుకుతున్న చైర్మన్, ఈవో

పాపన్నపేట్, జూలై 8: ప్రసాద్ దర్శన్‌తో ఏడుపాయల అభివృద్ధి చేస్తానని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఎంపీగా ఎన్నికైన తర్వాత సోమవారం ఆయన తొలిసారి ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ చైర్మన్ బాలగౌడ్, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన దర్శన్ పథకం కింద ఏడుపాయల్లో అభివృద్ధి చేపడుతామన్నారు. ఈ మేరకు ఏడుపాయల్లో అవసరమైన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈవో కృష్ణ ప్రసాద్‌కు సూచించారు.

నన్ను గెలిపించినందుకు ధన్యవాదాలు

నర్సాపూర్, జూలై 8: మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిపించినందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతున్నానని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సోమవారం నర్సాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఓటర్ మహాశయులకు కృతజ్ఞతలు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, కౌన్సిలర్లు బుచ్చేశ్‌యాదవ్, రాజేందర్, సురేశ్, నాయకులు రమేశ్‌గౌడ్, రమణారావు, రఘువీరారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆంజిగౌడ్, పాపన్నపేట మండల అధ్యక్షుడు రాములు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పరిణిత, సత్యనారాయణ, నందరెడ్డి, నరేశ్, పెంటయ్య, ఇమాన్యుయల్, భాగేశ పాల్గొన్నారు

నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినొద్దు

- బేకరీలు, స్వీట్‌హౌస్, పాస్ట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు
- అపరిశుభ్రంగా ఉన్న తినుబండరాలు స్వాధీనం
- రూ. 17,500 జరిమానా

పాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ అధికారులు

బేకరి యజమానికి జరిమానా విధిస్తున్న మున్సిపల్ అధికారులు

మెదక్ మున్సిపాలిటీ, జూలై 8: నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తినొద్దని, దీంతో వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నదని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేశ్ తెలిపారు. మెదక్‌లోని బేకరీలు, స్వీట్‌హౌస్‌లు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లలో మున్సిపల్ అధికారులు సోమవారం తనిఖీలు చేశారు. తనిఖీల్లో పలు బేకరీలు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లలో అపరిశుభ్రంగా ఉన్న ఆహార పదార్థాలు, ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసిన తినుభండారాలను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ కవర్లను సైతం స్వాధీన పర్చుకుని రూ.17,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తినుభండారాలను శుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు ఆదేశించారు. బేకరీలు, పాస్ట్‌ఫుడ్ సెంటర్లలో ఆహార పదార్థాలు తయారు చేసే వారు హెడ్‌క్యాప్, చేతులకు గ్లౌజ్‌లు ధరించాలన్నారు. గడువు ముగిసిన కూల్ డ్రింక్‌లు, తాగు నీటి బాటిళ్లను అమ్మరాదన్నారు. హోటల్లో తాగునీరు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది శ్యామ్, శ్రీనివాస్, శేఖర్, కిరణ్, కిషన్, లక్ష్మణ్, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామాయంపేట: సుతారిపల్లిలో వైద్య శిబిరం

కొల్చారంలో వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

- సుతారిపల్లిలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు

రామాయంపేట, జూలై 8: మండలంలోని సుతారిపల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులతో వారం రోజులుగా ప్రజలు మంచాన పడిఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినా గ్రామస్తులు ఏ మాత్రం కోలుకోలేదు. దీంతో సోమవారం గ్రామ కార్యదర్శి డీ.ధర్మారం పీహెచ్‌సీ సిబ్బందితో మాట్లాడి వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. ఈ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్యం అందిస్తున్నది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో తాగునీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

కొల్చారంలో అవగాహన

కొల్చారం, జూలై 8: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీహెచ్‌ఈవో మదన్‌మోహన్ సూచించారు. సోమవారం కొల్చారంలో ఆయన సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సీసీరోడ్లు, కాల్వలు పరిశుభ్రతతో పాటు నీళ్లు నిల్వకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయనతో ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు, ఏఈ ఇర్ఫాన్, సెక్రటరీ అంజయ్య, నాయకులు రాజాగౌడ్, చెన్నయ్య, మహేశ్వర్‌రెడ్డి, బాలరాజు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు, వేతనాలు ఇవ్వాలి

నర్సాపూర్‌లో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మెదక్, జూలై 8 (నమస్తే తెలంగాణ): పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నర్సమ్మ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతి పత్రం అందజేశారు. ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్షులు రూప్లీ, జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి బాలవ్వ, లింగవ్వ, షబానా, శహీన, లావణ్య, లక్ష్మి, నర్సమ్మ, సుశీల పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించకుంటే ఉద్యమం చేస్తాం

శివ్వంపేట, జూలై 8: పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే ఉద్యమం చేస్తామని పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. సోమవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు నిరసన చేశారు. ఈ నెల 10వ తేదీ వరకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించి, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి వారు హెచ్చరించారు. నిరసనలో పంచాయతీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆసీఫ్, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్, జూలై 8: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పుష్ప, మున్సిపల్ అధ్యక్షుడు అశోక్, సభ్యులు జ్యోతి, అనిత, జనార్దన్ ఉన్నారు.

అక్రమ కేసులు బనాయించడం సమంజసం కాదు

నర్సాపూర్, జూలై 8: అక్రమంగా కేసులు బనాయించడం పోలీసులకు సమంజసం కాదని నర్సాపూర్‌కు చెందిన బాధితులు రామారావు, గోడ రాజేందర్, బుచ్చేశ్‌యాదవ్, ఓంకార్ ఆరోపించారు. ఈ సందర్భంగా వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2013లో లక్ష్మణ్‌రావు తనకున్న 605 గజాల స్థలాన్ని మణికొండ రామారావుకు విక్రయించాడన్నారు. దీనికి సంబంధించిన పూర్తి డబ్బులు లక్ష్మణ్‌రావు తీసుకుని తమకు రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడని తెలిపారు. 2015లో తనకు ఇంకొంత డబ్బులు రావాలని రామారావుపై కోర్టులో పిటిషన్ వేశాడని, దానికి సంబంధించిన సెటిల్‌మెంట్ చేసుకోవాలని కోర్టులో రాజీపడ్డామని పేర్కొన్నారు. అనంతరం 2018లో ఈ భూమిని రామారావు స్థానికులైన గోడ రాజేందర్, బుచ్చేశ్ యాదవ్, ఓంకార్ యాదవ్ లైన తమకు విక్రయించి, రిజిస్ట్రేషన్ చేయించాడని తెలిపారు. 2023లో లక్ష్మణ్‌రావు, ఎన్ఆర్ఐ అని చెబుతూ భూముల ధరలు పెరిగిన తర్వాత మళ్లీ బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బులు ఇంకా రావాలని పోలీస్, రాజకీయ నాయకుల ద్వారా ఒత్తిడి చేశాడని ఆరోపించారు. ఇదే విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు చేయకుండా తిరిగి తమపైనే కేసు బనాయించారన్నారు. కోర్టులో ఉన్న కేసుకు ప్రస్తుతం మళ్లీ కేసు చేయడం ఏమిటని ప్రశ్నించారు. భూ క్రయవిక్రయాల్లో పూర్తి డబ్బులు ఇచ్చి, భూమి కొన్న తర్వాత ఇలా పోలీసులు కేసులు వేయడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమార్కులకు ఒకే భూమిని రెండు, మూడు సార్లు విక్రయించే వారికి పోలీసులు మద్దుతు తెలపడం సమంజసం కాదన్నారు. దీనిపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

అంబేద్కర్ అభయ హస్తం అమలు చేయాలి

నిజాంపేట, జూలై 8: బీఆర్ఎస్ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిన దళిత బంధు పథకం తరహా కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. సోమవారం నిజాంపేటలో విలేకరులతో మాట్లాడారు. దళితుల సంక్షేమం, అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించాలని, చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని అన్నారు. దళిత పోలీసులపై దాడులు జరుగుతున్నాయని, అందుకు నిదర్శనమే అశ్వరావుపేట ఎస్సైపై దాడి అని అన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, మాజీ ఉపసర్పంచ్ బాబు, మాల మహానాడు మండల ఉపాధ్యక్షుడు ఎల్లం, మహేశ్ ఉన్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 8: విద్యా వలంటీర్లను నియమించి, బదిలీ అయిన ఎస్జీటీలందరిని వెంటనే రిలీవ్ చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మ్యూచువల్ టీచర్ల బదిలీలు చేపట్టాలని, ప్రతి పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

టీఈసీవోప రాష్ట్ర అధ్యక్షుడిగా మోరే రాజ్‌కుమార్

రాజ్‌కుమార్

నర్సాపూర్, జూలై 8: తెలంగాణ ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మోరే రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్ల సమావేశం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో నిర్వహించారు. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్‌గా మోరే రాజ్‌కుమార్ విధులు నిర్వర్తిస్తున్నారు.

తైబజార్ వేలం వాయిదా

కొల్చారం, జూలై 8: తైబజార్ వేలం వాయిదా పడినట్లు పంచాయతీ కార్యదర్శి అంజయ్య తెలిపారు. వేలంలో పాల్గొనే వారు గతంలో వేలం పాటదారులు బకాయిలు చెల్లించనందున గ్రామస్తుల సమక్షంలో తైబజార్ వేలం వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ వేలంపాట నిర్వహించే తేదీని తెలియజేస్తామన్నారు.

సమస్యల పరిష్కరం కోసమే ప్రజావాణి

మెదక్ రూరల్, జూలై 8: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యల పరిష్కరానికి ప్రజావాణి నిర్వహిస్తునట్లు తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మెదక్ తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి, ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. డబల్ బెడ్‌రూమ్ ఇండ్ల కోసం 15, భూసమస్యలపై రెండు, మీసేవపై ఒకటి మొత్తం 18 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం

పవన్‌కల్యాణ్ (ఫైల్)

శివ్వంపేట, జూలై 8: మండలంలోని చిన్నగొట్టిముక్ల గ్రామ శివారులో ఆదివారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. సోమవారం మృతదేహం ఆచూకీ తెలిసింది. పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. గుమ్మడిదల మండలం కొత్తపేట గ్రామానికి చెందిన గూడెం మల్లేశం కుమారుడు గూడెం పవన్‌కల్యాణ్ (26) గత నెల 29వ తేది నుంచి కనిపించకుండపోయాడు. వెతికినా ఆచూకీ లభించలేదు. చిన్నగొట్టిముక్ల గ్రామం భయాన చెరువు సమీపంలో గుర్తుతెలియని మృతదేశం వద్ద ఉన్న మొబైల్, బట్టల ఆధారంగా బాధితులు గుర్తించారు. తన కొడుకు మరణంపై పలు అనుమానాలు ఉన్నాయని మృతుడి తండ్రి గూడెం మల్లేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, SYED YASEEN, previously Called SYED YASEENMIYA, S/o. Syed Babumiya, R/o. 1-91/1, Raipally (V), Zaheerabad (M), Sanga Reddy (D), TS, hereby inform that My Old Name was SYED YASEENMIYA. Now I Changed My Name as SYED YASEEN for all pupose.
NT-328249

★I, ZAHEER NAZEER SHAIKH, S/o. Nazeer Shaikh, previously Called as SHAIKH ZAHEER, S/o. Shaikh Nazeer, R/o. Plot No. 27, Basawanagar Colony, Zaheerabad, Sanga reddy (Dist.), TS, hereby inform that My Old Name was SHAIKH ZAHEER, S/o. Shaikh Nazeer. Now I Changed My Name as ZAHEER NAZEER SHAIKH, S/o. Nazeer Shaikh for all pupose.
NT-328250

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్రయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.